ప్రజాశక్తి
మంగళవారం 7 ఫిబ్రవరి 2023 5
శ్రీ సత్యసాయి



నేడు జీ-20 బృందం పర్యటన

ప్రజాశక్తి-లేపాక్షి

జి-20 దేశాల ప్రతినిధుల బందం మంగళవారం నాడు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. కర్నాటక రాష్ట్రం పావగడ సోలార్ పార్క్ సందర్శన నిమిత్తం జి-20 దేశాల ప్రతినిధుల బందం మంగళవారం ఉదయం రానుంది. సోలార్ పార్క్ సందర్శన అనంతరం సాయంత్రం 4 గంటలకు లేపాక్షి ఆలయాన్ని సందర్శిస్తారు. ఈ మేరకు అధికారులు ఇప్పటికే దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం సాయంత్రం అనంతపురం ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. శ్రీసత్యసాయి జిల్లా కొడికొండ నుంచి చిలమత్తూరు, మడకశిర, పావగడ సోలార్ పార్కు వరకు ఉన్న రహదారిపై పర్యటించి క్షుణ్ణంగా పరిశీలించారు. బందోబస్తు చర్యలపై ఆయా పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు.



విద్యుత్‌దీపాలంకరణలో లేపాక్షి ఆలయం

పేద రైతుల కోసం పోరాటం



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న వ్యకాసం నాయకులు, పేద రైతులు

- సాగుదారులందరికీ తక్షణం పట్టాలు ఇవ్వాలి
- సత్యసాయి కలెక్టరేట్ ఎదుట సిపిఎం, వ్యకాసం ఆందోళన
- కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లెందుకు ప్రయత్నం, అడ్డుకున్న పోలీసులు
- కలెక్టర్ హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సాగులో ఉన్న పేద రైతులందరికీ భూమి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున పోరాటం చేపట్టారు. సోమవారం నాడు జిల్లా నలమూలల నుంచి వచ్చిన పేద రైతులు కలెక్టరేట్‌ను ముట్టడించారు. ముందుగా ఎనుములపల్లి గణేష్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడ బైటాయించి నిరసన తెలిపారు. సమస్యను అధికారులకు తెలిపేందుకు కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు నాయకులు ప్రయత్నించారు. వీరిని పోలీసులు అడ్డుకున్నారు. స్పందనలో అర్జీలు ఇవ్వడానికి వస్తే గేట్లు వేస్తారా.? ఇదెక్కడి న్యాయం అంటూ పేదలు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు అడ్డుకుంటున్నా వ్యకాసం ఆధ్వర్యంలో రైతులు, కూలీలు కలెక్టరేట్ గేట్లు ఎక్కి కార్యాలయంలోకి ప్రవేశించారు. కార్యాలయం ఆవరణలో బైటాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి పేదలు భూములు సాగు చేసుకుంటున్నా, వారికి పట్టాలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా పెనుకొండ, సోమందపల్లి, రొద్దం, చిలమత్తూరు, హిందూపురం తదితర మండలాల పరిధిలో ఎన్నో ఏళ్లుగా పేదలు పట్టాల కోసం అర్జీలు ఇస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పేదలు సాగు చేసుకుంటున్న భూములను అధికార పార్టీ నాయకులు ఆక్రమించుకుంటున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల ధర్మవరం ఎమ్మెల్యే కలెక్టరేట్‌కు వస్తే ఆయనకు రాజమర్యాదలు చేసిన అధికారులు పేదలను మాత్రం ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. పేదల భూములను ఆక్రమించుకున్న మంత్రి ఉషాశ్రీచరణ్, ఎపిఐఐసి ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డిలు ప్రభుత్వ భూములను ఆక్రమించకుంటున్నా అధికారులు నోర మెదకపోవడంలో ఆంతర్యం ఏమిటన్నారు. సాగుదారులందరికీ పట్టాలు ఇచ్చేంత వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు పేద దళిత, గిరిజనుల భూములు ఆక్రమించుకుంటున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ సమస్యలన్నింటిపై కలెక్టర్ స్పష్టమైన హామీ ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. ఆందోళన విషయం తెలుసుకున్న కలెక్టర్ బసంత్‌కుమార్ ఆందోళనకారుల వద్దకు వచ్చి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలోనే అన్ని మండలాల్లో అసైన్‌మెంట్ కమిటీ సమావేశం జరుగుతుందని, ఆయా తహశీల్దార్లు పంపిన నివేదికలు ఆధారంగా కమిటీ ఆమోదిస్తుందన్నారు. ఇందులో పేదలందరికీ న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో పేదలు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, నాయకులు నారాయణ, వెంకట రాముడు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు హనుమయ్య, వెంకటేశులు, సిఐటియు నాయకులు జగదీష్, రామకష్ణ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రంగప్ప, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు..!

- సమస్యల పరిష్కారంపై నిరసనబాట
- ఫేస్‌యాప్ హాజరును ఉపసంహరించాలి
- అంగన్‌వాడీలను విస్మరిస్తే జగన్‌కు పతనమే



అంగన్‌వాడీల ధర్నాలో ప్రసంగిస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్



సమస్యల పరిష్కారంపై అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమస్యల పరిష్కారంపై అంగన్‌వాడీలు కదంతొక్కారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. సిఐటియు, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నాడు మహాధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మబూన్నీషా అధ్యక్షత నిర్వహించిన ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయని మండిపడ్డారు. అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేయడానికే కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని, అందులో భాగంగానే కేంద్ర బడ్జెట్‌లో నిధులు కోత విధించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తాను తక్కువ కాదన్నట్లు అనేక నిబంధనలు అమలు చేస్తూ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్‌ను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. సమస్యలు పరిష్కరించాలని ప్రశ్నిస్తే పోలీసులతో అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలకు పాల్పడటం దుర్మార్గంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో వైఎస్ఆర్‌సిపి అధికారంలోకి వస్తే అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా మారుస్తామని, కనీస వేతనాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో వాటి ఊసే ఎత్తకపోవడం దుర్మార్గంగా ఉందన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీరుప్రకారం గ్రాట్యూటి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులు, తొలగింపులను ఆపాలన్నారు. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ అమలుకు సంబంధించి కొన్ని ప్రాజెక్టుల్లో గత 6నెలల నుంచి మెనూ బిల్లులు ఇవ్వలేదన్నారు. అంగన్వాడీ సెంటర్లో మౌలిక వసతులు లేవన్నారు. గత 8 సంవత్సరాలుగా టీఏ బిల్లులు చెల్లించడంలేదన్నారు. రకరకాల యాప్‌లు తీసుకొచ్చి పనిభారం పెంచారు తప్పా, వేతనాలు పెంచలేదన్నారు. అంగన్‌వాడీలను ఇబ్బందులకు గురి చేసేలా తీసుకొచ్చిన పేస్‌యాప్‌ను రద్దు చేయాలన్నారు. అంగన్వాడీల మీద పనిభారం తగ్గించాలన్నారు. సమస్యల పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్‌వాడీల ఆందోళన విషయం తెలుసుకున్న కలెక్టర్ బసంత్‌కుమార్ వారివద్దకొచ్చి మాట్లాడారు. అంగన్‌వాడీలకు జిల్లా పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర స్థాయి సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దిల్‌షాద్, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా కోశాధికారి శ్రీదేవి, చంద్రకళ, లావణ్య, లక్ష్మీదేవి, రమణమ్మ, బావమ్మ, పైపల్లి గంగాధర్, గౌస్‌లాజిమ్, నరసింహులు, వెంకటేష్, రామచంద్ర పాల్గొన్నారు.



విలేఖరులతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్, ముస్లిం మైనార్టీలు

ఖబరస్తాన్‌లో రాజకీయాలు చేస్తోంది.. ఎవరో ప్రజలకు తెలుసు

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని గాంధీనగర్ ఖబరస్తాన్ విషయంలో రాజకీయాలు చేస్తోంది ఎవరో ప్రజలందరికీ తెలుసునని, అనవసరంగా ఇందులో రాజకీయాలు చేయడం మానుకోవాలని నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెల రోజులక్రితం జరిగిన ఈ ఘటనపై ఎమ్మెల్యే కేతిరెడ్డి ఇప్పుడెందుకు మాట్లాడారని ప్రశ్నించారు. ముస్లింలకు తమ పెద్దల సమాధులను దైవంగా చూసుకుంటారని, అదేవిధంగా సమాధులపై రాతిపై చెక్కిన అక్షరాలను పవిత్రంగా భావిస్తారని అలాంటి వాటిని ఇష్టానుసారంగా కూల్చివేయడం ఏంటని ప్రశ్నించారు. ఈ ఘటన జరిగిన రోజే తాము ఎక్కడా ఇందులో కేతిరెడ్డి పాత్ర ఉందని ఆరోపించలేదన్నారు. ముస్లిం మత పెద్దలందరికీ కలిసి నిర్ణయం తీసుకోవాలని మాత్రమే సూచించామని గుర్తుకు చేశారు. అయితే ఈ సమస్య పరిష్కారమైందని అనుకున్న సమయంలో కేతిరెడ్డి మరోసారి చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో మీ పాత్ర లేకుంటే విజయవాడ నుంచి హడాహుడిగా ఎందుకు పరుగెతుంకుటూ వచ్చారని ప్రశ్నించారు. జామీయా మసీదు ముతవల్లిని ఇష్టానుసారం తిట్టిన విషయాన్ని శ్రీరామ్ తప్పుబట్టారు. అంతేకాకుండా గ్రామాల్లో కూడా రెండు వర్గాల మధ్య చిచ్చుపట్టి ఏదో ఒక వర్గం తనవైపు ఉండేలా చూసుకుంటున్నారని ఆరోపించారు. బలవంతంగా ఒకవర్గంపై కేసులు పెట్టిసు న్నారన్నారు. ప్రజల మనోభావాలను దెబ్బతీస్తే తక్షణమే టిడిపి స్పందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, ముస్లిం నాయకులు నాగూర్‌హుస్సేన్, రాళ్లపల్లి షరీఫ్, కృష్ణాపురం జమీర్ అహమ్మద్, పఠాన్ బాబూఖాన్, మహిళా నాయకురాళ్లు సాహెబ్బీ, బీబీ, షామీర్, ఇర్షాద్, మాబు, ఇమాం, బాజాఫకర్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఘన స్వాగతం

చిలమత్తూరు : అనంతపురం జిల్లా పర్యటనకు వస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కర్నాటక, ఆంధ్రాసరిహద్దు ప్రాంతం టోల్ గేట్ వద్ద వైసిపి హిందూపురం నియోజక వర్గ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, వైసిపి మాజీ సమన్వయ కర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, స్థానిక నాయకులు జగన్ మోహన్ రెడ్డి, రాజారెడ్డి తదితరులు మంత్రికి స్వాగతం పలికారు.

జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు యశోద విద్యార్థినులు



జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో యశోద పాఠశాల యాజమాన్యం

ధర్మవరం టౌన్ : విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి త్రోబాల్ ఎంపికలో సీనియర్ విభాగంలో తమ పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు యశోద పాఠశాల డైరెక్టర్ ఫథ్వీరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 9వతరగతి చదువుతున్న పోషిత, జూనియర్ విభాగంలో 8వతరగతి చదువుతున్న హేమశ్రీ, ప్రజ్ఞ, 7వతరగతి చదువుతున్న ధాత్రి ప్రతిభ కనబరచి ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈనెల 18, 19వ తేదీల్లో కేరళలో జరిగే త్రోబాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. దీంతో సోమవారం పాఠశాలలో ఎంపికైన విద్యార్థినులను డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపల్ అనూప్, వ్యాయామ ఉపాధ్యాయులు అశోక్, చెరీష్ అభినందించారు.

ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని వన్‌టౌన్ సిఐ సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం పట్టణంలోని నెహ్రూనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన మోడల్ పేపర్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ఇష్టపడి చదవాలన్నారు. ఒక కుటుంబంలో ఒక వ్యక్తి చదువుకుని మంచిస్థాయికి ఎదగడం ద్వారా వారితోపాటు మరో నాలుగు తరాలు బాగుపడి తద్వారా దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో మంచిస్థాయికి ఎదగాలంటే పదో తరగతి పరీక్షలు చాలా ముఖ్యమన్నారు. ఈ పుస్తకాలను ఉపయోగించి విద్యార్థులు చక్కగా పరీక్షలు రాయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ తెలుగు పండిట్ జయసింహ, వైసిపి వార్డు ఇన్‌ఛార్జి కత్తా పెద్దన్న, యుటిఎఫ్ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణనాయక్, కార్యదర్శులు హరికృష్ణ, రామంజినేయులు, పాఠశాల హెచ్‌ఎం నాగేంద్ర, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ నాగభూషణం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



యుటిఎఫ్ టెన్త్ మోడల్ పేపర్స్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న వన్‌టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి

శ్మశాన వాటికలో ముళ్ల కంపలు తొలగింపు

ప్రజాశక్తి మడకశిర రూరల్

పట్టణంలోని శివపురం వద్ద ఉన్న శ్మశానవాటికలో పెరిగిన ముళ్లకంపలను మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీ నరసమ్మ ఆధ్వర్యంలో సోమవారం తొలగించారు. కొన్ని సంవత్సరాలగా దళితుల శ్మశానవాటికలో ముళ్లకంపలు, పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో మృతదేహాలకు అంత్యక్రియలు చేయడానికి తీవ్ర ఇబ్బందులు ఉండేవి. సమస్యను గ్రామస్తులు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు శ్మశాన వాటికలో ఉన్న ముళ్ల కంపలు పిచ్చి మొక్కలను సమవారం తొలగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కుమారుడు జయరాజు, సచివాలయ కన్వీనర్ గోపి, సోషల్ మీడియా కన్వీనర్ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

మేదర కమ్యూనిటీ భవనానికి స్థలాన్ని కేటాయించండి

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి, ధర్మవరం, కదిరి పట్టణాల్లో మేదర కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయించాలని మేదర వర్కింగ్ కమిటీ అధ్యక్షులు వీరభద్రయ్య కోరారు. ఈమేరకు సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. కదిరి, పుట్టపర్తి, ధర్మవరం పట్టణాల్లో కమ్యూనిటీ భవనానికి 10 సెంట్లు స్థలం కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగమల్లేశప్ప, ప్రభాకర్, లక్ష్మీనారాయణ, హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో ఆయాకు వేతనం

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని సేవమందిర్ అంధుల ఆశ్రమంలో అంధ విద్యార్థులకు ఆయా సేవల కొరకు ఒక మహిళను నియమించారు. అయితే ఆమెకు ప్రభుత్వం నుండి వేతనం అందలేదు. ఈ నేపథ్యంలో విద్యార్థుల సౌలభ్యం కోసం తన వంతుగా సంవత్సరం పాటు ఆయాకు నెలకు రూ 5వేలను ఇచ్చేందుకు దివ్య ఎడ్యుకేషన్ ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు పరిగి వేణుగోపాల్‌రావు ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా సోమవారం తన కార్యాలయ సిబ్బంది ద్వారా పాఠశాలకు వెళ్లి ఆయా గంగమ్మకు రూ 5వేల గౌరవ వేతనాన్ని అందించారు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరీముల్లా, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

బేకరీలో కాలంచెల్లిన తినుబండారాలు పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి అమరాపురం

మండల కేంద్రంలోని బెంగళూరు బేకరీలో కాలం చెల్లిన తినుబండారాల అమ్మకాలు జరుగుతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. గతంలో పలుమార్లు అధికారులను ఫిర్యాదు చేసిన పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదేంటని వినియోగదారులు అడిగితే వారికి సరైన సమాధానం చెప్పకుండా బేకరీ నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనలు పాటించని బేకరీ యజమానులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వాలంటీర్ ఆత్మహత్య

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండల కేంద్రానికి చెందిన గిరిమల్లెప్ప కుమారుడు బీపీ నవీన్‌కుమార్ (34) కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నవీన్‌కుమార్ నాలుగేళ్ల నుంచి వాలంటీర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. అయితే నాలుగేళ్ల క్రితం కర్నూలు జిల్లా అవుకు గ్రామంలో వివాహం చేసుకున్నాడు. కొన్నేళ్లుగా వీరి దాంపత్య జీవితం సాఫీగా సాగింది. అయితే సంతానం కలగకపోవడంతో ఈమధ్యకా లంలో తరచూ గొడవలు జరుగుతుండేవి. గతేడాది నుంచి భార్య పేరిట భూమి చేయాలని నవీన్‌కుమార్‌పై భార్య తండ్రి ఒత్తిడి తీసుకొచ్చాడు. దీంతో సమస్య మరింత జఠిలమైంది. ఓవైపు కుటుంబ కలహాలు.. మరోవైపు సంతానలేమితో బాధపడుతున్న సమయంలో భార్య పుట్టింటికి వెళ్లింది. ఈనేపథ్యంలో ఒంటరి ఉంటూ జీవితంపై విరక్తి చెంది సోమవారం తెల్లవారుజామున సొంతింట్లో చీరతో ఇనుప దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంతసేపైనా తలుపు తీయకడంతో అతికష్టం మీద డోర్ పగలగొట్టి చూడగా అప్పటికే మృతి చెందినట్లు భావించారు. మతి చెందిన చోటే 'నా సావుకు కారణం నేనే.. కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకుంటున్నా..' అంటూ సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ పరశురాముడు ఘటనా స్థలానికి చేరుకుని తండ్రి గిరిమల్లప్ప ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

స్పందనలో వచ్చే అర్జీల పరిష్కారంపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వాటికి పరిష్కారం చూపాలని కలెక్టర్ బసంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో స్పందన అర్జీలను స్వీకరించారు. 173 అర్జీలు ప్రజలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలోని అధికారులతో వివిధ అంశాలపై మాట్లాడారు. సమస్యల పరిష్కారం నిమిత్తం వివిధ ప్రాంతాల నుంచి ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ప్రజలు స్పందనకు వస్తారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సకాలంలో సమస్యలు పరిష్కరించాలన్నారు. గహ నిర్మాణం, ఉపాధి హామీ పథకంలో పురోగతి సాధించాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఇళ్లు పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రాధాన్యత గల ప్రభుత్వ భవన నిర్మాణ పనులనూ వేగవంతం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్ర భవనాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాలల్లో చేపట్టిన పనులు పూర్తి చేయాలన్నారు. ఆధార్‌కార్డు వంద శాతం అనుసంధానం చేసే ప్రక్రియ ఈనెల 7వ తేదీ నుంచి ప్రారంభం చేస్తున్నామన్నారు. ముఖ ఆధారిత హాజరు విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఇంకా చాలామంది ఈ విధానాన్ని నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ, డిఎంహెచ్ఓ కష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, సిపిఓ విజయ్ కుమార్, డిపిఓ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ

గాండ్లపెంట : మండల పరిధిలోని మల్ల మీద పల్లి పంచాయతీలో రూ.2.50 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి సోమవారం భూమి పూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. రైతులు పంటలు పెట్టుకోవడానికి విద్యుత్ సరఫరాలో సమస్యలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో రైతులు అడిగిన వెంటనే నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. గ్రామానికి చెందిన ముబారక్ ఎకరా పొలాన్ని సబ్‌స్టేషన్ నిర్మాణానికి రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో డిఇ మోసస్, ఎడి ఆనంద్. ఎంపిపీ తాతం జగన్మోహన్, వైసీపీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ సి కళావతి, వైస్ ఎంపిపి భారతి, మాజీ సర్పంచి గోపాల్ రెడ్డి, సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో కదిరి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి కదిరి టౌన్

అంతర్జాతీయ కరాటే పోటీలలో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు మాస్టర్ షాకీర్ తెలిపారు. ఈనెల 3,4,5,వ తేదీలలో విశాఖపట్నం స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో 6వ అంతర్జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు యునైటెడ్ షోటోఖాన్ కరాటే డో ఇండియా, మహిరా షోటోఖాన్ కరాటే డో ఇండియా ఆధ్వర్యంలో ఈ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారని అన్నారు. ఈ పోటీలకు నేపాల్, బంగ్లాదేశ్ భూటాన్ దేశాల నుండి వచ్చిన వారు పాల్గొన్నారన్నారు. ఈ పోటీలలో శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలోని వివిధ పాఠశాలల నుండి 12 మంది 24 విభాగాలలో పాల్గొని 4 బంగారు, 6 వెండి,13 కాంస్య పతకాలను సాధించి సత్తా చాటారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన గురువులను ఆయా పాఠశాలల నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

పేదల కడుపు కొడుతున్న వైసిపి

ధర్మవరం టౌన్ : టిడిపి హయాంలో అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసి పేదలకు అన్నం పెడితే వైసిపి అధికారంలోకి వచ్చాక అన్నా క్యాంటీన్లను ఎత్తేసి పేదల కడుపు కొడుతోందని టిడిపి నాయకులు మండిపడ్డారు. ఈమేరకు స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద టిడిపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటిన్‌లో పార్లమెంట్ టిడిపి కోశాధికారి చింతపులుసు పెద్దన్న తండ్రి చింతపులుసు పెద్దన్న జ్ఞాపకార్థం సోమవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. ముఖ్యంగా పేదవాడికి అందనంత దూరంలో నిత్యావసరాల ధరలు పెరిగాయన్నారు. అదుపు చేయడానికి ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ వ్యవస్థను వైసిపి పూర్తిస్థాయిలో కనుమరుగు చేసిందన్నారు. రానున్న కాలంలో టిడిపికి ఓటు వేసేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

లేపాక్షి : మండల కేంద్రంలోని దుర్గా వీరభద్ర పాపానసేశ్వర ఆలయానికి సంబందించి 114రోజులకు గాను హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. హుండీ ఆదాయం 3,13,857 రూపాయలు వచ్చిందని ఆలయ ఈవో నరసింహ మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి నరసింహరాజు, గ్రామస్తులు రామాంజినేయులు, రవి, తదితరులు పాల్గొన్నారు.

12న ఉచిత కంటి వైద్యశిబిరం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని కోట మున్సిపల్ పాఠశాలలో ఈనెల 12వతేదీ నిర్వహించనున్న ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రోటరీక్లబ్ కార్యదర్శి రామకృష్ణ, సభ్యులు సోలిగాళ్ల వెంకటేశులు, క్యాంపు ఛైర్మన్ నరేంద్రరెడ్డి, సత్రసాల ప్రసన్నకుమార్, బీవీ చలం, శివయ్య, సుదర్శన్ గుప్త తెలిపారు. ఈమేరకు సోమవారం స్థానిక రోటరీక్లబ్‌లో వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెంగళూరులోని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యుల సమక్షంలో కంటిచూపు తగ్గిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయించనున్నట్లు తెలిపారు. కావున కంటి చూపు తగ్గినవారు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో వైఎస్ఆర్ సంచార పశువైద్యసేవలు

గాండ్లపెంట : మండలంలోని వైఎస్ఆర్ సంచార పశు వైద్యసేవ అంబులెన్స్ అందుబాటులో ఉంటుందని పశువైద్య అధికారి బి చెన్నకేశవ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామీణ ప్రాంతాలలో పశువుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ సంచార పశువైద్యసేవలు అందిస్తుందన్నారు. అంబులెన్స్ టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేస్తే వెంటనే వచ్చి పశువులకు సంచార అంబులెన్స్ లోనే వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకుంటారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జిల్లాపరిషత్ పాఠశాల తనిఖీ

లేపాక్షి : మండలం పరిధిలోని వివేకానంద జిల్లా పరిషత్ పాఠశాలను డిఇఒ మీనాక్షి సోమవారం తనిఖీ చేశారు. రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ పాఠశాల తనిఖీలో విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన తక్కువగా జరిగినట్లు తేలిందన్నారు. ఈ నేపథ్యంలో తాము పాఠశాలను సోమవారం తనిఖీ చేశామన్నారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో డివైఇఒ రంగస్వామి, ఎంఇఒ నాగరాజు నాయక్, హెచ్ఎం సల్మాన్‌రాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

12న విగ్రహ ప్రతిష్టాపన

ధర్మవరం టౌన్ : శీతలాదేవి సమేత రామలింగేశ్వరస్వామి నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలకు ప్రజలు తరలిరావాలని వైసిపి వార్డు ఇన్‌ఛార్జి కోటిరెడ్డి బాలిరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సాకే చిన్నకృష్ణ, బెస్త రామకృష్ణ తెలిపారు. సోమవారం పట్టణంలోని దుర్గానగర్‌లో నూతనంగా పున్ణనిర్మించిన ఆలయంలో కమిటీ సభ్యులు ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 8వ తేదీ నుంచి 12వతేదీ వరకు రోజూ హోమాలు, ప్రత్యేక పూజల నడుమ మహాగణపతి, సుబ్రహ్మణ్య, శివ పార్వతీ, శీతలాదేవి, నవగ్రహ నంది, చక్ర ధ్వజ ప్రతిష్ట మహోత్సవాలు వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ జరుగుతాయని తెలిపారు. 12న విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్డీటీలో ఏరియా స్థాయి క్విజ్ పోటీలు

బత్తలపల్లి : మండల కేంద్రంలోని ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో సోమవారం ఏరియా స్థాయి క్విజ్ ఫెస్టివల్ నిర్వహించినట్లు ఎటిఎల్ రుక్మాంగద తెలిపారు. ఈ పోటీల్లో 20 మంది విద్యార్థులతో ఐదు టీములు పాల్గొన్నాయన్నారు. 10 మంది అమ్మాయిలు, 10 మంది అబ్బాయిలు పాల్గొన్న ఈ క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి పోట్లమర్రి జట్టు గెలుపొందినట్లు తెలిపారు. అదేవిధంగా ద్వితీయ బహుమతిని తాడిమర్రి మండల జట్టు దక్కించుకున్నట్లు తెలిపారు. ఈ రెండు జట్లు ఫిబ్రవరి 28న బత్తలపల్లిలో జరిగే రీజినల్ పోటీల్లో పాల్గొంటాయన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు కిషోర్, రవి, ఆర్డీటీ సిబ్బంది వెంకటేశు, లక్ష్మీనారాయణ, నాగరాజు, తిమ్మరాజు, శివాజి, సంఘం బడి ఉపాధ్యాయ పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి జాతర

పరిగి : మండలంలోని ఊటకూరులో బాల చౌడేశ్వరి అమ్మవారి జాతర వైభవంగా నిర్వహించారు. ఆంధ్ర, కర్నాటక ప్రాంతాల నుండి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పెనుగొండ ఎమ్మెల్యే శంకర్నారాయణ ఆలయంల ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ జాతరలో భూతప్పల నిర్వహణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దిలీప్ కుమార్, నరేందర్ రెడ్డి, నరసింహమూర్తి, ప్రభాకర్, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఇంగ్లీష్ నేర్చుకోవాలి

ఓబుల దేవర చెరువు : స్థానిక కేజీబీవీ విద్యార్థులు ప్రతి ఒక్కరు ఇంగ్లీష్ నేర్చుకోవాలని ఎస్ఐ గోపి తెలిపారు. స్పోకెన్ ఇంగ్లీష్ ఇన్స్టిట్యూట్ అధినేత రాజశేఖర్ ఆధ్వర్యంలో ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్, మోటివేషనల్ కార్యక్రమాన్ని సమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంగ్లీష్ ప్రాముఖ్యత గురించి విద్యార్థునులకు వివరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సోమందేపల్లి : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ వద్ద సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎపిసిపిఎస్ఇఎ రూపొందించిన క్యాలెండర్‌ను ఎస్ఐ విజయ్ కుమార్, ఎంఇఒ ఆంజనేయ నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం లక్షల సిపిఎస్ ఉద్యోగుల మనోవేదనను అర్థం చేసుకోవాలన్నారు. ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ ను రద్దుచేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రంగేష్ కుమార్, మండల అధ్యక్ష కార్యదర్శులు సోమశేఖర్, గణేష్. ఉపాధ్యాయులు జవ్వాజి నాగరాజు, చంద్ర, సజ్జరాయప్ప, రామకృష్ణ, వినోద్, సంజీవ రాయుడు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బరితెగించిన మట్టిమాఫియా



టిప్పర్‌తో మట్టి తరలింపు

ప్రజాశక్తి - పరిగి

మండల వ్యాప్తంగా మట్టి మాఫియా బరితెగించింది. మాఫియా వ్యవహారం రోజు రోజుకు శృతి మించుతంది. వీరి ఆగడాలను అడ్డుకోవడానికి అధికారులు కూడా వెనకంజ వేస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. మండలంలో ఇటుక వ్యాపారానికి పెట్టింది పేరు. ఇటుకల తయారీకి మట్టి అవసరంఉంది. ప్రభుత్వం మట్టి తరలింపుపై ఆంక్షలు విధించడం వల్ల కొందరు గుత్తదారులుగా వ్యవహరించి వ్యాపారులతో ఒప్పందాలు కుదుర్చుకొని మట్టి తరలింపు కార్యక్రమాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. మండలంలోని శాసనకోట పొలం 381-2 సర్వేనెంబర్ కుంట ప్రాంతంలోని మట్టిని సోమవారం అక్రమంగా తరలించారు. మట్టి తరలింపుపై ఇటీవల ఉన్నత స్థాయి అధికారి జెసిబి, ట్రాక్టర్లు, టిప్పర్ల యజమానులతో సమావేశం నిర్వహించి అందుకు సంబంధించిన విధి విధానాలు తెలియజేశారు. ఇందులో భాగంగా తప్పనిసరిగా అనుమతులు తీసుకునే మట్టిని తరలించాలని హెచ్చరించారు. అయితే అది గడిచి వారం కాకమునుపే ట్రాక్టర్లతో కాకుండా ఏకంగా టిప్పర్లనే మట్టి తరలింపునకు మాఫియా

యథేచ్ఛగా టిప్పర్లతో మట్టి తరలింపు

వాడుతోంది. మాఫియా చర్యలు అధికారులకు సవాల్ విసిరినట్లు ఉందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ మట్టి తరలింపు పై ఇరిగేషన్ అధికారులను వివరణ కోరగా తాను విజయవాడ హైకోర్టు పనిమీద ఉన్నానని ఇక్కడి సమస్యను పరిష్కరించాలని స్థానిక అధికారులకు సమాచారం ఇచ్చినా వారు పట్టించుకోలేదని అన్నారు. ఇరిగేషన్ అధికారులకు స్థానిక అధికారులు సహకరించాలని అలాంటిది మండలంలో ఈ విధానం కొరవడిందని అన్నారు. ఇదిలా ఉండగా మట్టితరలింపును అధికారులు అడ్డుకుంటే అంతు చూస్తానని టిప్పర్, జెసిబి యజమానులు అధికారులను బెదిరిస్తున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి.

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

తలుపుల : రాష్ట్రాభివృద్ధే వైసిపి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం 1 పరిధిలో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందజేస్తున్న ప్రజాసంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రఫీ నాయక్, సర్పంచి శ్రీలత, ఉపసర్పంచి డికె. బాబు తదితరులతో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అమరాపురం : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. మండల పరిధిలోని బసవన్నపల్లిలో సర్పంచి భాగ్యమ్మ అధ్యక్షత సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న ప్రజాసంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, వైస్ ఎంపీపీ లలితమ్మ కృష్ణమూర్తి, జెడ్పీటీసీ సారక్క నరసింహమూర్తి, వక్కలిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ నళిని రంగేగౌడ్, డైరెక్టర్ వీరక్యాతప్ప, ఎంపిడిఒ మునిస్వామితో పాటు వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

హిందూపురం : వైసిపి ప్రభుత్వం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం సోమవారం మోడల్ కాలనీలో కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇక్బాల్ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ జబీవుల్లా, వార్డు ఇన్‌ఛార్జి డిష్ చాందు, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

జగన్ పాలనలో ఎస్సీ, బీసీలకు ఒరిగిందేమీలేదు : టిడిపి

ప్రజాశక్తి రొద్దం

జగన్‌పాలనలో ఎస్సీ, బిసిలకు ఒరిగిందేమీ లేదని టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పార్థసారధి విమర్శించారు. మండలంలోని పెద్దమంతూరు, రొప్పాల, కొత్తపల్లి గ్రామాల్లో సోమవారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో పార్థసారధి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి పాలన గురించి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. జగన్ రెడ్డి తుగ్లక్ నిర్ణయాల వల్ల రాష్ట్ర పాలన అస్తవ్యస్తంగా తయారైందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నరహరి, జిల్లా అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నాయకులు అశ్వర్థనారాయణ, రాము, శంకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తుడితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పార్థసారధి

ఫేస్‌యాప్ అటెండెన్స్ వద్దు

గోరంట్ల : విఆర్ఎలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పేస్ యాప్ అటెండెన్స్‌ను మినహాయింపు ఇవ్వాలని మండలంలోని విఆర్ఎలు కోరారు. ఈ సందర్భంగా వారు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ వీఆర్ఏలకు పేస్ యాప్ అటెండెన్స్ మినహాయింపు ఇవ్వాలని కోరారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. అర్హులైన విఆర్ఎలను అటెండర్లుగా ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు పైబడిన గ్రామ సేవకుని ఉద్యోగం తన వారసులకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామ పంచాయతీల వీఆర్ఏలు పాల్గొన్నారు

జగనన్న గృహ లబ్ధిదారులకు అవగాహన

ప్రజాశక్తి - అమడగూరు

మండలంలోని జగనన్న గృహ లబ్ధిదారులకు హౌసింగ్ అధికారులు సోమవారం అవగాహన కల్పించారు. ఎఇ భాను ప్రకాష్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు గృహ లబ్ధిదారులతో మాట్లాడారు. గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు రాజేశ్వరి, శశికళ, అమృత, రవీందర్ నాయక్, రాజకుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

గోరంట్ల : మండలంలోని పాలసముద్రం పంచాయతీ బెల్లాల గ్రామ సమీపాన నిర్మాణంలో ఉన్న నందిని వైర్ హౌస్ వద్ద జరిగిన ప్రమాదంలో విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతిచెందాడు. వైర్ హౌస్ పై పైకప్పు రేకులు పరుస్తుండగా బాపట్ల జిల్లాకు చెందిన హరికృష్ణ (33) విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు సిఐ సుబ్బరాయుడు తెలిపారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గడ్డివామి దగ్ధం

లేపాక్షి : మండలం పరిధిలోని సోమిరెడ్డి పల్లిలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంల రైతు సోమశేఖర్ కి సంబందించిన గడ్డివామి దగ్ధం అయింది. సుమారు 40వేల రూపాయల విలువ జేసే నాలుగు ట్రాక్టర్ల మొక్కజొన్న, రాగి, జొన్న గడ్డి దగ్ధం అయింది. తనను ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.



కాలిపోతున్న గడ్డివామి

పిల్లల నడవడికపై నిఘా ఉంచండి

కదిరి అర్బన్ : విద్యార్థులు, మైనర్ల నడవడికపై వారి తల్లిదండ్రులు నిఘా ఉంచాలని పట్టణ సిఐ తమ్మిశెట్టి మధు సూచించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇచ్చినట్లయితే యాజమాన్యం, పిల్లల తండ్రి తండ్రులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో మద్యం సేవించి వాహనాలు నడపడం మైనర్లకు వాహనాలు ఇవ్వడం తదితర అంశాలపై కఠినమైన చర్యలు తీసుకుంటామని సిఐ చెప్పారు. ఈ మధ్యకాలంలో పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వడమే కాకుండా వారి అతి ప్రేమతో పిల్లల్లో క్రమశిక్షణ లేకుండా చేస్తున్నారని వ్యాఖ్యానించారు.

చోరీకి గురైన సెల్‌ఫోన్లు బాధితులకు అందజేత

పుట్టపర్తి రూరల్ : జిల్లా వ్యాప్తంగా చోరీకి గురైన సెల్‌ఫోన్లకు సంబందించి బాధితుల ఫిర్యాదు మేరకు రికవరీ చేసిన 21 సెల్‌ఫోన్లను బాధితులకకు సోమవారం అందజేశారు. ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆధ్వర్యంలో అందజేసిన ఈ సెల్‌ఫోన్ల విలువ సుమారు రూ. 3.50 లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కెవి. రామకృష్ణ ప్రసాద్, క్యాట్ (కాల్ అనాలసిస్ టీం) ఆర్ఎస్ఐ వెంకటేశ్వర రావు, క్యాట్ సిబ్బంది రవి, శీను, చంద్ర శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

బత్తలపల్లి : మండలంలోని డి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన చల్లా రంగానాయుడు కుమారుడు చల్లా కిషన్‌చౌదరి (22) సోమవారం ఆకాల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గ్రామానికి చేరుకుని మృతునికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శిఇంచారు. పరామర్శించిన వారిలో వైసిపి జిల్లా అధికార ఎప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపిపి గజ్జెల వెంగళరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు చల్లా శ్రీరాములు, చల్లా కృష్ణమనాయుడు, బయపరెడ్డి, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, తదితరులు ఉన్నారు.

వేగనియంత్రికలు ఏర్పాటు

చిలమత్తూరు : రోడ్డు ప్రమాదాలు నివారణకు చిలమత్తూరు ఎస్ ఐ శ్రీనివాసులు చొరవతో స్థానిక కోడూరు తోపు వద్ద గల 44 వ జాతీయ రహదారిపై స్పీడ్ బ్రేకర్ల వద్ద 6 వేగనియంత్రికలను ఏర్పాటు చేశారు. ప్రీతి డెవలపర్స్ సౌజన్యంతో వీటిని ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా వీటిని ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.

ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ జయంతి

హిందూపురం : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోదులు ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ జయంతి వేడుకలు సోమవారం పట్టణంలోని అబ్దుల్ గఫార్ ఖాన్ పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంఇఒ గంగప్ప కేక్ కట్ చేసి విద్యార్థులకు తినిపించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అదానీ అక్రమ వ్యాపారాలపై విచారణ జరపాలి

ప్రజాశక్తి-హిందూపురం

ఆదానీ అక్రమ వ్యాపారాలపై సిబిఐ, సంయుక్త పార్లమెంటరీ కమిటీతో విచారణ జరపాలని ఎపి కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి, ఎల్ఐసి కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జంగా గౌతమ్, ఎఐసిసి మెంబర్ కెటి శ్రీధర్, హిందూపురం జిల్లా అధ్యక్షుడు సుధాకర్, పెనుకొండ ఇన్‌ఛార్జి నరసింహులు మాట్లాడుతు బిజెపి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్ని నిర్వీర్యం చేయడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. ఎల్ఐసి, ఎస్‌బిఐలకు నష్టం చేకూరేలా వాటి ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టిన ఆదానీ సంస్థపై వచ్చిన ఆర్థిక ఆరోపణలపై విచారణ చేయకుండా ఇంకా వారికి కొమ్ముకాయడం దారుణమన్నారు. అదానీ గ్రూప్ అక్రమ వ్యాపారాలపై సిబిఐతో పాటు జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేసి సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేసారు. అదానీ సంస్థల ఆర్థిక కార్యకలాపాలపై విచారణ జరిపి వాస్తవాలు బయటపెట్టే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు శ్యామ్ కిరణ్, పిసిసి మెంబర్ హరిత, నాయకులు షాహిద్, హనుమంతారాయప్ప, సైపు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పంటరుణాలు రెన్యువల్

సోమందేపల్లి : పంట రుణాలు పొందిన మండలానికి చెందిన రైతులు ఫిబ్రవరి 7వ తేదీ నుండి మార్చి 28వ తేదీ లోపల తమ రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని సొసైటీ అధ్యక్షులు జి కొల్లయ్య, సిఇఒ పి. శ్రీనివాసులు తెలిపారు. రుణాల రెన్యూవల్ కోసం వచ్చే రైతులు తప్పనిసరిగా వన్ బి, ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, పాసు పుస్తకం జిరాక్స్, నాలుగు ఫోటోలు తీసుకురావాలని సూచించారు. సకాలంలో రుణాలు రెన్యూవల్ చేసుకోవడం వల్ల ప్రభుత్వం నుండి వచ్చే సబ్సిడీలు వర్తిస్తాయని తెలిపారు. సొసైటీ బ్యాంకులలో రైతులకు పలు సౌకర్యాలు కల్పిస్తున్నారని వాటిని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

అవగాహన కోసమే పోలీస్ కవాతు

ప్రజాశక్తి-హిందూపురం

సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించడం కోసమే రాపిడ్ యాక్షన్ ఫోర్స్, స్పెషల్ పార్టీ పోలీసులతో ర్యాలీ నిర్వహించినట్లు కేంద్ర రాపిడ్ యాక్షన్ ఫోర్స్ అడిషనల్ ఎస్పీ వినోద్ పేర్కొన్నారు. కేంద్ర రాపిడ్ యాక్షన్ ఫోర్స్ రిజినల్ ఎస్పీ వినోద్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో పోలీస్ రాపిడ్ యాక్షన్ ఫోర్స్, స్పెషల్ పార్టీ పోలీసులు ఫ్లాగ్ మార్చ్(పోలీస్ కవాత్)ను అదునాతనమైన ఆయుధాలతో కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ సిఐ వెంకటేశ్వర్లు, స్థానిక పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీకి వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో ఇప్పటి వరకు ఒక్క ప్రభుత్వ కళాశాల సైతం ఏర్పాటు చేయలేదని, వెంటనే ప్రభుత్వ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఈ విషయంపై సోమవారం ఎమ్మెల్సీ ఇక్బాల్‌ను ఆయన నివాసంలో కలిసి సమస్యను వివరించి, వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రి కళాశాల లేక పోవడంతో పేద మధ్య తరగతి విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2016లో అప్పటి టిడిపి ప్రభుత్వం కళాశాలను మంజూరు చేసిందని దీంతో పట్టణంలో శ్రీకంఠాపురంలో ఉన్న ఝాన్సీ లక్ష్మీబాయి ప్రభుత్వ పాఠశాలలో నాలుగు గదులలో లాంఛనంగా ప్రారంభించారని చెప్పారు. ఆ సమయంలో త్వరలో స్థల సేకరణ చేసి, అన్ని సౌకర్యాలతో నూతన కళాశాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే ఇంత వరకు ప్రారంభం కాలేదన్నారు. అసలు కళాశాల మంజూరు అయిందా...లేదా అన్న అనుమానాలు ఉన్నాయన్నారు. రూరల్ మండలం చర్లపల్లి వద్ద 9 .44 ఎకరాల్లో స్థలాన్ని కళాశాల కోసం సేకరించామని తెలిపారనిఅయితే ఇప్పటి వరకు సేకరించిన స్థలంలో భవన నిర్మాణ పనులు చేపట్టలేదని విమర్శించారు. దీనిపై స్పందించి రాష్ట్ర స్థాయి అధికారులతో చర్చించి స్థలంతో పాటు నిర్మాణానికి అవసరమైన నిధులు, పోస్టుల భర్తీకి కృషి చేసి, వచ్చే విద్యాసంవత్సరం నుంచి కళాశాల ప్రారంభం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, హర్షకుమార్, భగత్, మహేష్, అభి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.